క్లుప్తంగా

నేలకొరిగిన మొక్కజొన్న



జగన్నాథపురంలో దెబ్బతిన్న మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న అధికారులు

గోపాలపురం: ఈదురుగాలులతో కూడిన వర్షానికి మండలంలోని సుమారు 200 ఎకరాల్లో మొక్కజొన్న పంట నేలకొరిగిందని మండల వ్యవసాయ శాఖ అధికారి బి.రాజారావు తెలిపారు. ఆదివారం రాత్రి కురిసిన పంటకు నష్టం వాటిల్లింది. దెబ్బతిన్న పంటలను సోమవారం ఆయన పరిశీలించి ప్రాథమిక అంచనా వేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 4,438 ఎకరాలలో మొక్కజొన్న సాగు చేపట్టారని, భీమోలు, గుడ్డిగూడెం, కొవ్వూరుపాడు, సగ్గొండ, వెంకటాయపాలెం, చిట్యాల గ్రామాల్లో పంటకు నష్టం కలిగిందని, దీనిపై నివేదికను ప్రభుత్వానికి సమర్పించనున్నట్టు తెలిపారు.

ఛత్రపతి శివాజీకి నివాళి



శివాజీ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పిస్తున్న బీజేపీ నాయకులు

కొవ్వూరు: ఛత్రపతి శివాజీ మహారాజ్ వర్ధంతి సందర్భంగా పట్టణంలో రాజీవ్ కాలనీలో సోమవారం బీజేపీ నాయకులు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. శివాజీ పోరాట పటిమను వక్తలు కొనియాడారు. పట్టణ బీజేపీ అధ్యక్షుడు బీవీ ముత్యాల రావు, కౌన్సిలర్ పిల్లలమర్రి మురళీ కృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి పిక్కి నాగేంద్ర, గోలింగాచార్యులు, తీడా సూర్యనారాయణ, గోశాల శ్రీనివాస్, కొండపల్లి రత్నసాయి, ఉప్పాడ వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్ జైలులో ఆర్వో ప్లాంట్ ప్రారంభం



ఆర్వో ప్లాంట్ ప్రారంభిస్తున్న కలెక్టర్ మాధవీలత

కంబాలచెరువు: సెంట్రల్ జైలులో ఖైదీల తాగునీటి కోసం ఓఎన్జీసీ ఇచ్చిన ఆర్వో వాటర్ ప్లాంట్‌ను కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సెంట్రల్ జైలుకి రూ.2,83,200 విలువైన ఆర్వో వాటర్ ప్లాంట్‌ను ఓఎన్జీసీ ఇవ్వడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జైళ్లశాఖ డీఐజీ ఎంఆర్ రవి కిరణ్, జైలు సూపరింటెండెంట్ కె.రాజారావు, ఓఎన్జీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అమిత్ నారాయణ్, చీఫ్ జనరల్ మేనేజర్ నవీద్‌రావు, జనరల్ మేనేజర్ ఎస్పీ జగన్నాథరావు, సీఎస్ఆర్ డిప్యూటీ జనరల్ మేనేజర్ శ్రీనివాస్, చీఫ్ మేనేజర్ నిర్మల రాబర్ట్ పాల్గొన్నారు.

10న వాహనాల వేలం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో రాజమహేంద్రవరం నార్త్‌స్టేషన్ పరిధిలో సారా, ఇతర నేరాల్లో పట్టుకున్న మూడు మోటారు వాహనాలు, ఒక ట్రైసైకిల్‌కు ఈనెల 10వ తేదీ సోమవారం ఉదయం 10 గంటలకు స్టేషన్ ఆవరణలో వేలం నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ఇన్‌స్పెక్టర్ పీవీ రమణ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఇతర వివరాలకు 91777 44055 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఊరిలోనే ఉపాధి

- ఉపాధి కూలీలకు పెరిగిన వేతనం
- రూ.257 నుంచి రూ.272కు పెంపు
- 2023–24లో 5,866 పనులకు రూ.12.58 కోట్లు చెల్లించాలని అంచనా



సమిశ్రగూడెంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

నిడదవోలు రూరల్: గ్రామీణులకు ఉన్న ఊరిలోనే మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో పని లభిస్తోంది. సొంతూరులోనే ఉపాధి దొరకడంతో ఎక్కువ మంది ఆసక్తి చూపుతున్నారు. కూలీలకు పనికి తగ్గ వేతనం ప్రభుత్వాలు కల్పిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఉపాధి కూలి గతం కంటే రూ.15 పెంచింది. దీంతో గ్రామల్లో పనులు వేగం పెరిగి, పల్లెలు అభివృద్ధి బాట పడుతున్నాయి. 2023–24 సంవత్సరానికి సంబంధించిన నిడదవోలు నియోజకవర్గంలోని నిడదవోలు, పెరవలి, ఉండ్రాజవరం మండలాల్లో 5,866 పనులను గుర్తించారు. 23,735 మంది కూలీలకు పని కల్పించేందుకు రూ.12.58 కోట్లు అవసరమని మండల స్థాయి ఉపాధి హామీ ఏపీఓలు ఉన్నతాధికారులకు నివేదికలు పంపించారు. అంతేకాకుండా గతేడాది కంటే కూలీల సంఖ్య పెంచేందుకు ప్రణాళికలు రూపొందించారు. వీటిలో ఎక్కువగా పంటకాలువలు, పంటబోదెలు పూడికలు తీయడం, తాగునీరు, ఊరచెరువుల పూడిక తీయడంతో పాటు నీటి కుంటలు తవ్వడం వంటి పనులు ఉన్నాయి. గత మూడేళ్లుగా ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ లేకపోవడంతో పనులు నిలిపివేసిన నిడదవోలు మండలం కోరుపల్లి గ్రామంలో కూడా ఈ ఏడాది పనులు చేపట్టారు.

ఏప్రిల్ నుంచి అమలు

ఉపాధి పనులు చేసే కూలీలకు వేతనం పెరిగింది. పెంచిన వేతనం ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి అమలులోకి రానుంది. కొలతల ప్రకారం రోజుకు రూ.257 చెల్లిస్తుండగా, దానికి అదనంగా రూ.15 పెంచి రూ.272 అందేలా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. పెంచిన కూలీరేట్లపై అధికారులు క్షేత్రస్థాయిలో కూలీలకు అవగాహన కల్పిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా అమల్లోకి తీసుకువచ్చిన నేషనల్ మొబైల్ మానిటరింగ్(ఎన్ఎంఎంఎస్) విధానంతో కూలీల సంఖ్య తగ్గింది. వేతనం చెల్లించేందుకు జాబ్‌కార్డులు, బ్యాంకు ఖాతాలు, ఆధార్ అనుసంధానం తప్పనిసరి చేసింది. కూలీ అదనంగా రూ.15 చొప్పున పెంచడం, యంత్రాలతో వ్యవసాయ పనులు చేయడంతో మళ్లీ ఉపాధి కూలీల సంఖ్య పెరిగే అవకాశం ఉంది.

జాబ్‌కార్డు ఉంటేనే పనులు

జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ పని కల్పించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. 2023–24 ఏడాదికి సంబంధించి నియోజకవర్గంలోని నిడదవోలు, ఉండ్రాజవరం, పెరవలి మండలాల్లో 14,074 యాక్టివ్ జాబ్‌కార్డులు ఉండగా 23,735 మంది యాక్టివ్ కూలీలు ఉన్నారు. 5.14 లక్షల పనిదినాలు కల్పించేందుకు ప్రణాళికలు రూపొందించారు. గతేడాది పనిచేసిన కూలీలకు రూ.12.30 కోట్లు వేతనాలు ఇవ్వగా ఈఏడాది పనిదినాలు పెంచి రూ.12.58 కోట్లు వేతనాలుగా చెల్లించనున్నారు.

నియోజకవర్గంలో ఉపాధి హామీ కూలీల వివరాలు..

మండలం	జాబ్ కార్డులు	పనికి వస్తున్న ఉపాధి కూలీలు	గుర్తించిన పనులు (2023-24)
నిడదవోలు	5,916	9,951	1,980
పెరవలి	4,254	6,877	1,735
ఉండ్రాజవరం	3,904	6,907	2,151

కష్టానికి తగ్గ ఫలితం



ఉపాధి కూలీ ఇప్పటివరకు రూ.257 వచ్చేది. రూ.15 అదనంగా పెరిగింది. ఆనందంగా ఉంది. ఈనెల నుంచి 100 రోజుల ఉపాధి ప్రణాళిక కూడా మొదలుకావడంతో పని చేసుకుంటున్నాం. కష్టానికి తగిన ప్రతిఫలం లభిస్తోంది. కూలి సొమ్ము ప్రభుత్వం సకాలంలో మా బ్యాంకు ఖాతాల్లోనే జమ చేస్తోంది. వేసవిలో పని ప్రదేశాల్లో సౌకర్యాలు కూడా కల్పించాలి.

–గెడ్డం వెంకమ్మ, ఉపాధి కూలీ, సమిశ్రగూడెం

ఎక్కువ పనులు గుర్తించాం



గత ఏడాది కంటే ఈ ఏడాది 150 పనులను అధికంగా గుర్తించాం. ఉపాధి కూలీలు కూడా పనులు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. జాబ్‌కార్డు కలిగిన ప్రతి కూలీకి ఉపాధి పనులు కల్పించేలా ప్రణాళిక చేపట్టాం. ఉన్న ఊర్లోనే రూ.272 కూలీ అందించే ప్రక్రియకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకున్నాయి. పెరిగిన వేతనంపై కూలీలు సంతోషంగా ఉన్నారు.

– టి.మూర్తిబాబు, ఎంపీడీఓ, నిడదవోలు

కోటసత్తెమ్మ ఆలయ అన్నదాన ట్రస్ట్‌కు విరాళం



విరాళం అందజేస్తున్న దాత శ్రీనివాసరావు దంపతులు

నిడదవోలు రూరల్: తిమ్మరాజుపాలెం గ్రామంలో ఉన్న కోటసత్తెమ్మ అమ్మవారి ఆలయ అన్నదాన ట్రస్ట్‌కు నిడదవోలుకు చెందిన ఆరేపల్లి శ్రీనివాసరావు దంపతులు రూ.1,00,001 విరాళాన్ని అందజేసినట్టు ఈఓ బళ్ల నీలకంఠం(శివ) తెలిపారు. దాత శ్రీనివాసరావుకు అమ్మవారి చిత్రపటాన్ని అందజేసి, సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ దేవులపల్లి రామసుబ్బరాయశాస్త్రి, ధర్మకర్తల మండలి సభ్యులు గాజుల రంగారావు పాల్గొన్నారు.

నేడు ఆసరా చెక్కుల పంపిణీ

నిడదవోలు రూరల్: నిడదవోలు పట్టణ, మండల పరిధిలోని స్వయం సహాయక సంఘాల మహిళలకు వైఎస్సార్ ఆసరా చెక్కులను మంగళవారం ఎమ్మెల్యే జి.శ్రీనివాసనాయుడి చేతుల మీదుగా పంపిణీ చేయనున్నట్టు జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు కాలాబత్తుల సుజాత సోమవారం తెలిపారు. నిడదవోలు బాలికల జూనియర్ కళాశాల ఆవరణలో జరిగే ఈ కార్యక్రమంలో ఉదయం 9 గంటలకు నిడదవోలు మెప్మా పరిధిలో డ్వాక్రా మహిళలు, మధ్యాహ్నం 2 గంటలకు నిడదవోలు మండల పరిధిలో డ్వాక్రా మహిళలంతా హాజరుకావాలని ఆమె కోరారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్

పెరవలి: బాలింతలు, గర్భిణులు, చిన్నారులు, బాలికలు పౌష్టికాహారం తీసుకున్నప్పుడే పూర్తి ఆరోగ్యవంతులుగా ఉంటారని ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ తెలిపారు. ఖండవల్లి సెక్టార్‌లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు ఉండే చిరుధాన్యాలు, ఆకుకూరలు ఎక్కువగా తీసుకున్నప్పుడే అన్ని విటమినులు లభిస్తాయన్నారు. చిరు ధాన్యాల్లో పోషకాలు అధికంగా ఉంటాయని ఆకు కూరలు వల్ల రక్తహీనత తగ్గుతుందన్నారు. ఇవే కాకుండా వేరుశనగ అచ్చులు క్రమం తప్పకుండా తీసుకోవాలని అలాగే ఎక్కువగా మునగ ఆకు కూరను తీసుకుంటే అన్ని కంటే విటమినులు అధికంగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ ఎం.వనజాక్షి, వైద్య సిబ్బంది, గర్భిణులు, కిషోర్ బాలికలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ముగిసిన పోషణ్ పక్వాడ్



కార్యక్రమంలో మాట్లాడుతున్న సర్పంచ్ బండి చిననాగరాజు

నల్లజర్ల: గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యం దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం పౌష్టికాహారం అందిస్తోందని తెలికిచెర్ల గ్రామ సర్పంచ్ బండి చిననాగరాజు(చిట్టీ) అన్నారు. పోషణ్ పక్వాడ్ ముగింపు కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉదయం గ్రామ సచివాలయంలో మహిళా, శిశుసంక్షేమ శాఖ నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో సర్పంచ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.రక్తహీనత నివారణకు అంగన్‌వాడీ కేంద్రాల్లో బెల్లం, చిరుధాన్యాలతో కూడిన ఆహారం అందిస్తున్నట్టు ఐసీడీఎస్ సెక్టారు సూపర్‌వైజర్ ఎస్‌వీ కృష్ణవేణి వివరించారు. అనంతరం సంపూర్ణ పోషణ కిట్లను గర్భిణులకు అందజేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ నక్కా పండు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పది పరీక్షలు ప్రారంభం



వేములూరు డీపీ హైస్కూల్ వద్ద నోటీసు బోర్డులో రూమ్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు



ఖండవల్లిలో రూమ్‌ల నంబర్లను చూసుకుంటున్న విద్యార్థులు

దేవరపల్లి: పదో తరగతి పరీక్షలు దేవరపల్లి, గోపాలపురం, నల్లజర్ల మండలాల్లో 14 పరీక్షా కేంద్రాల్లో ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో పరీక్షా కేంద్రాల వద్ద సందడి నెలకొంది. దేవరపల్లి మండలంలోని అంబటి సత్యనారాయణరావు జెడ్పీ హైస్కూల్, శ్రీచైతన్య, హర్షవర్ధన, యర్నగూడెం జెడ్పీ హైస్కూలు, చిన్నాయగూడెం జెడ్పీ హైస్కూల్ పరీక్షా కేంద్రాల్లో 1022 మంది విద్యార్థులకు గాను 995 మంది హాజరయ్యారు. తొలిరోజు పరీక్షకు మండలంలో 27 మంది విద్యార్థులు గైరాహాజరైనట్టు విద్యాశాఖ అధికారి తిరుమలదాస్ తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు.

చాగల్లు: మండలంలోని మూడు పరీక్షా కేంద్రాల్లో 421 మంది విద్యార్థులకు గాను 406 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. చాగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 178 మంది, ఊనగట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 125 మంది, మార్కొండపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 103 మంది పరీక్షలకు హజరయ్యారని, పరీక్ష ప్రశాంతంగా జరిగిందని ఎంఈఓ వి.ఖాదార్‌బాబు తెలిపారు.

కొవ్వూరు: పట్టణంలో నాలుగు, మండలంలో నాలుగు పరీక్ష కేంద్రాల్లో మొత్తం 1176 మంది పరీక్షలకు హాజరు కావాలి ఉండగా 1155 మంది పరీక్ష రాశారు. 21 మంది విద్యార్థులకు గైర్హజరయ్యారు.

నల్లజర్ల: మండలంలో ఆరు సెంటర్లలో 1057 మంది పదో తరగతి విద్యార్థులు పరీక్షలకు హాజరుకావాల్సి ఉండగా 1030 మంది మాత్రమే హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను తహసీల్దారు వి.కిశోర్‌కుమార్ పరిశీలించారు.

పెరవలి: మండలంలో మూడు సెంటర్లలో పది పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఖండవల్లి, కాకరపర్రు, కానూరు గ్రామాల్లోని ఉన్నత పాఠశాలల్లో జరిగిన పరీక్షలకు 746 మంది రాయాల్సి ఉండగా 13 మంది గైర్హాజరయ్యారు. పరీక్షల్లో ఎటువంటి మాస్ కాపీయింగ్‌కి అవకాశం లేకుండా సిబ్బంది చర్యలు తీసుకున్నారు.

తాళ్లపూడి: మండలంలోని తాళ్లపూడి, వేగేశ్వరపురం, మలకపల్లి సెంటర్లలో పదో విద్యార్థులు పరీక్షలు రాశారు. మొత్తం 672 మంది విద్యార్థులకు గాను 651 మంది హాజరయ్యారని, 21 మంది గైర్హాజరైనట్టు ఎంఈవో కె.వివేకానంద తెలిపారు.

గోపాలపురం: మండలంలో గోపాలపురం, రాజంపాలెం, దొండపూడి జడ్పీ హైస్కూళ్లలో పది పరీక్షలకు 865 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 824మంది హాజరు అయ్యారు. 41మంది గైర్హాజరైనట్టు మండల విద్యాశాఖ అధికారి జి.శ్రీనివాసరావు తెలిపారు. పరీక్షా కేంద్రాలను గోపాలపురం ఎస్ఐ కె.రామకృష్ణ ఎప్పటికప్పుడు పరిశీలించారు.

ఉండ్రాజవరం: మండలంలో ఐదు కేంద్రాల్లో 934 మంది పదో తరగతి విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 919 మంది హాజరయ్యారు. విద్యార్థులు తొలిరోజు పరీక్షకు హజరైనట్లు ఆయన తెలిపారు. 15 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు మండల విద్యా శాఖాధికారి పీవీఎస్ నాగరాజు సోమవారం తెలిపారు.

నిడదవోలు రూరల్: నిడదవోలు పరిధిలోని 9 పరీక్ష కేంద్రాల్లో 1400 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకావాల్సి ఉండగా 1378 మంది హాజరైయ్యారు. 22 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈఓ కిషోర్‌కుమార్ తెలిపారు.

ఘనంగా సీతారామ స్వామివారి ఊరేగింపు

నిడదవోలు రూరల్: ఉనకరమిల్లిలో శ్రీరామనవమి 81వ వార్షికోత్సవాల్లో భాగంగా సీతారామచంద్ర స్వామి ఊరేగింపును సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. మేళతాళాలతో, భాజాభజంత్రీలతో స్వామివారిని గ్రామ పురవీధుల్లో ఊరేగించడంతో అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వాటర్ ట్యాంకుల నిర్మాణానికి స్థల పరిశీలన

ఉండ్రాజవరం: ఇంటింటికీ తాగునీరు అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకున్నాయని రాజమహేంద్రవరం డివిజన్ ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ టి.శ్రీనివాసుబాబు అన్నారు. జలజీవన్ మిషన్ ద్వారా ప్రజలకు నిరంతరం తాగునీరు అందించేందుకు వాటర్ ట్యాంకులు నిర్మించనున్నారు. వాటి కోసం స్థలాలను సోమవారం డీఈ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో జలజీవన్ మిషన్‌లో భాగంగా చేపట్టబోయే 16 పనులకు రూ.22.04 కోట్లు మంజూరైనట్టు తెలిపారు. మండలంలో ఉండ్రాజవరం, చివటం, తాడిపర్రు, దమ్మెన్ను, సూర్యారావుపాలెం, కాల్దారీ గ్రామాలు ఎంపికైనట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఆర్.దుర్గా భవానీ, ఆయా గ్రామ సర్పంచ్‌లు, కార్యదర్శులు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు అండగా నిలవాలి

నిడదవోలు రూరల్: భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారానికి సభ్యులంతా అండగా నిలవాలని ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఈమన గ్రీస్మకుమార్ అన్నారు. నిడదవోలు ఇందిరానగర్‌లో అభ్యుదయ పెయింటర్స్, ఆర్టిస్ట్స్ యూనియన్ సర్వసభ్య సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రీస్మకుమార్ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మిక సంక్షేమ మండలి పరిరక్షణకు ఉద్యమించాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు నూతంగి రమేష్, సభ్యులు యల్లమెల్లి వరప్రసాద్, సురేష్‌కుమార్, యాదాల ప్రసన్న, మహేష్, నాగేంద్ర, కార్తీక్, వేణు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి తీవ్ర గాయాలు

కొవ్వూరు: పట్టణంలో శ్రీనివాసపురం సమీపంలో పెట్రోలు బంకు వద్ద సోమవారం సాయంత్రం రెండు మోటారుసైకిళ్లు ఎదురెదురుగా ఢీకొనడంతో చిందాటి శివ అనే వ్యక్తి తీవ్రగాయాలయ్యాయి. గోపాలపురం మండలం వాదాలకుంట గ్రామానికి చెందిన శివ, కోలమూరి పోసియ్య కలిసి మోటారుసైకిల్‌పై వస్తూ ఎదురుగా టీవీఎస్ మోపెడ్‌పై వస్తున్న కొమిరి శ్రీనును ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో శివ మోటారుసైకిల్‌పై ఉన్న పోసియ్యకు, మరో బైక్‌పై ఉన్న శ్రీనుతోపాటు అతని భార్యకు స్వల్పగాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన శివను కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్య సాయం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు.

నిందితుడి అరెస్టు

కొవ్వూరు: సారా కేసులో పరారీలో ఉన్న అన్నదేవరపేట గ్రామానికి చెందిన కాయిత హరికృష్ణను సోమవారం అరెస్టు చేసి, కొవ్వూరు కోర్టుకి తరలించినట్టు ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ వీటీవీవీ సత్యనారాయణ తెలిపారు. సారా కేసులో గతంలో నిందితులుగా ఉన్న చాగల్లు మండలం చిక్కాలకి చెందిన బైరిశెట్టి వెంకటేశ్వరరావు, సలాది నాగమణి చాగల్లు తహసీల్దార్ కోర్టులో బైండోవర్ చేసినట్టు తెలిపారు. ఇప్పుడు హరికృష్ణను అరెస్టు చేశారు.

సారా విక్రయిస్తున్న నలుగురి అరెస్టు



పట్టుకున్న మద్యం సీసాలు, సారా ప్యాకెట్లు, నిందితులతో పోలీసులు

దేవరపల్లి: నల్లజర్ల, దేవరపల్లి మండలాల్లో సారా, మద్యం సీసాలను విక్రయిస్తున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి, వారి నుంచి 34 మద్యం సీసాలు, పది లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్న దేవరపల్లి ఎస్ఈబీ సీఐ దిమ్మల సుధ సోమవారం తెలిపారు. నల్లజర్ల, ప్రకాశరావుపాలెం, గౌరీపట్నం, లక్ష్మీపురం గ్రామాల్లో దాడులు నిర్వహించినట్టు ఆమె తెలిపారు. దాడుల్లో ఎస్సై సుధీర్, సిబ్బంది పాల్గొన్నారు.

8న వాహనాల బహిరంగ వేలం

వివిధ కేసుల్లో పట్టుకున్న వాహనాలను ఈ నెల ఎనిమిదో తేదీన ఉదయం 11 గంటలకు దేవరపల్లిలోని ఎస్ఈబీ స్టేషన్ ఆవరణలో బహిరంగ వేలం వేస్తున్నట్టు సీఐ దిమ్మల సుధ తెలిపారు. వేలంలో పాల్గొనేవారు ఆధార్ కార్డు, రూ.5 వేలు డిపాజిట్ చెల్లించాలన్నారు. వేలంలో వాహనాలను దక్కించుకున్న వారు వెంటనే పాట సొమ్మును 18 శాతం జీఎస్టీతో కలిపి అదే రోజు చెల్లించాలని ఆమె తెలిపారు. మరిన్ని వివరాల కొసం దేవరపల్లి ఎస్ఈబీ స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

దమ్ము చక్రాలు దొంగలించిన వ్యక్తి అరెస్టు

ఉండ్రాజవరం: ట్రాక్టర్ దమ్ము చక్రాలు (ఐరన్) దొంగలించిన కేసులో ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్టు ఎస్సై కె.రామారావు తెలిపారు. ఎస్సై రామారావు తెలిపిన వివరాల ప్రకారం.. గత ఫిబ్రవరిలో మండలంలో తాడిపర్రు, ఉండ్రాజవరం, పాలంగి గ్రామాల్లో రైతులు పాకల్లో భద్ర పరుచుకున్న ట్రాక్టర్ దమ్ము(ఐరన్) చక్రాలను గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించారు. దానిపై ఉండ్రాజవరం పోలిస్‌స్టేషన్‌లో 4 కేసులు నమోదయ్యాయి. దొంగలను పట్టు కోవడానికి కొవ్వూరు డీఎస్పీ వీఎస్ఎన్ వర్మ రెండు టీంలను ఏర్పాటు చేశారు. ముద్దాయిని వెతుకే క్రమంలో సోమవారం ఉండ్రాజవరం సెంటర్‌లో వాహనాలను తనిఖీ చేస్తుండగా కె.సావరం గ్రామానికి చెందిన కోడేటి ఆదినారాయణ(28) అనే వ్యక్తి అరెస్టు చేసి అతని నుంచి 10 దమ్ము చక్రాలు, ఒక టాటా ఏస్ వ్యాన్‌ను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై తెలిపారు. దమ్ము చక్రాలు ఉండ్రాజవరం, తాడిపర్రు, పాలంగి గ్రామాలకు చెందిన రైతులవని, వాటి విలువ రూ.1.50లక్షలు ఉంటుందని తెలిపారు. ఈసందర్భంగా దొంగను పట్టుకోవడానికి సహకరించిన రెండు టీంలను కొవ్వూరు డీఎస్పీ వర్మ అభినందించారు.

బాబూ జగ్జీవనరామ్ విగ్రహ ఏర్పాటుపై వివాదం

- రంగంలోకి దిగిన పోలీసులు
- ఇరువర్గాలతో సంప్రదింపులు



తూర్పుచోడవరంలో ఇరువర్గాలతో మాట్లాడుతున్న పోలీసులు

నల్లజర్ల: తూర్పుచోడవరం గ్రామంలో బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహం ఏర్పాటు వివాదాస్పదమైంది. ఎస్సీ కాలనీలో గతంలో శ్మశాన స్థలంగా ఉన్న భూమిలో టీడీపీ హయాంలో కొంత మందికి ఇళ్ల స్థలాలు కేటాయించారు. వాస్తవంగా వాటికి పట్టాలు లేవు. ఇందులో ఒకరి కేటాయించిన స్థలంలో బాబూజగ్జీవన్‌రామ్ ఏర్పాటుకు ఒక వర్గం సన్నాహాలు చేస్తూ విగ్రహం తీసుకువచ్చారు. ఇందుకు మరో వర్గం అభ్యంతరం వ్యక్తం చేసింది. గ్రామ పంచాయతీ అనుమతులు లేకుండా విగ్రహం ఏవిధంగా ఏర్పాటు చేస్తారంటూ పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో నల్లజర్ల సీఐ లక్ష్మణరెడ్డి, ఎస్ఐ నరసింహమూర్తి తమ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని ఇరువర్గాలతో మాట్లాడారు. తాత్కాలికంగా ఇక్కడే విగ్రహాన్ని ఆవిష్కరించి రెండు రోజుల తర్వాత తొలగిస్తామని ఒక వర్గం కోరగా అందుకు రెండో వర్గం ససేమిరా అంది. తరన, భర్జనల తర్వాత ఇరువర్గాలకు ఆమోదయోగ్యమైన స్థలంలో విగ్రహాన్ని ఆవిష్కరించి తొలగిస్తామని అనుమతులు వచ్చాక అప్పుడే విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని చెప్పడంతో వివాదం సర్దుమణిగింది. అయినా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేస్తున్నట్టు సీఐ లక్ష్మణరెడ్డి తెలిపారు. గ్రామ పంచాయతీ తరపున డీడీఓ మహిళాదేవి, కార్యదర్శి కోట శ్రీను హాజరయ్యారు.

వైఎస్సార్ సీపీ గెలుపునకు కృషి చేయాలి



తిమ్మరాజుపాలెంలో మాట్లాడుతున్న పల్లారావు

నిడదవోలు రూరల్: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపునకు సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు మరింత కృషి చేయాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అయినీడి పల్లారావు అన్నారు. మండలంలోని తిమ్మరాజుపాలెం, కాటకోటేశ్వరం గ్రామాల్లో 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమంపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లారావు మాట్లాడుతూ మా నమ్మకం నీవే జగనన్న స్టిక్కర్లను ప్రతి ఇంటికీ అంటించాలని సూచించారు. సీఎం వైఎస్ జగన్ అమలు చేస్తున్న నవరత్నాలు పథకాలు, నిడదవోలు ఎమ్మెల్యే జి.శ్రీనివాసునాయుడు చేస్తున్న అభివృద్ధి పనులను ప్రజలకు వివరించాలన్నారు. ఈ సమావేశంలో జేసీఎస్ మండల కన్వీనర్ వెలగన పోలయ్య, సర్పంచ్ ముప్పిడి చంద్రశేఖర్, ఎంపీటీసీ పడాల రంగారావు, సొసైటీ అధ్యక్షుడు యాళ్ల రామారావు, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు పడాల శ్రీనివాస్, నాయకులు కీర్తి శ్రీను, తోట సుబ్బారావు, కారింకి బాబి, కంబాల అంజి, వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.